# పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- పాఠశాలల పునః ప్రారంభంలోగా వసతులు కల్పించాలి
- ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఇతర అధికారులు

జగిత్యాల, మే 17: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆమె రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోళ్లు, తదితర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి, ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పెయింటింగ్ వేయించాలని, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన చోట పెయింటింగ్ పనులు సైతం చేపట్టాలన్నారు. 17 జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంకు సంబంధించిన క్లాత్ సరఫరా చేశామని, మూడు రోజుల్లో మిగితా జిల్లాలకు పంపిస్తామని తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాం కుట్టే ఆర్డర్ ఇవ్వాలని సూచించారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే విద్యార్థులందరికీ యూనిఫాం అందించేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులతో మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక జత యూనిఫాం పాఠశాలలు ప్రారంభం నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని, ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకొని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు, ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, డీఆర్డీవో సంపత్ రావు, డీఈవో జగన్మోహన్ రెడ్డి, డీసీఎస్‌వో వెంకటేశ్వర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హతి రామ్, ఈఈలు రహమాన్, నారాయణ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్: పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

సారంగాపూర్: తాళ్ల ధర్మారంలో ..

కోరుట్ల రూరల్: నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

జగిత్యాల రూరల్, మే 17: జగిత్యాల రూరల్ మండలం పొలాస, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం పంచాయతీ అధికారులు డ్రైడే నిర్వహించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు ప్రబలవని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏపీవో గంగలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, రాఘవేందర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి, మే 17: పట్టణంలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను శుక్రవారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. మున్సిపల్ సిబ్బంది ముజీబ్, నిజామొద్దీన్, నర్సయ్య, తదితరులు పనులను పర్యవేక్షించారు.

సారంగాపూర్, మే 17: బీర్‌పూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, మే 17: మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

### భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

మారుతీనగర్, మే, 17: పట్టణంలో భూఆక్రమణలకు పాల్పడుతున్న ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని బాధితులు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని సర్వే నంబర్ 1121, 1122, 1123లో 99 గుంటల భూమి తమ తాతల నుంచి వారసత్వంగా వచ్చినట్లు నాంపెల్లి గట్టయ్య, కల్యాణి, ఆంజనేయులు, మారుతి, సంజీవ్‌కుమార్, నర్సయ్య, ఆంజనేయులు, మారుతి తెలిపారు. సదరు భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయగా, పక్కనే సర్వే నంబర్ 1119, 1120లో ఉన్న అల్లాడి రమణారావు, అల్లాడి రాజేందర్‌రావు (ప్రభుత్వ ఉద్యోగులు) తమ భూమి హద్దులను తొలగించి ఆక్రమించినట్లు తెలిపారు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

వెల్గటూర్, మే 17: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవికాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము రాంబాబు, రావు హనుమంతరావు, పొన్నం నరేశ్, మంచికట్ల రవి, దుర్గం రమేశ్, రజినీకాంత్, శ్రీధర్, కిరణ్, తదితరులున్నారు.

# విద్యార్థులు మెళకువలు నేర్చుకోవాలి

- మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్

తేజస్వినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, మే 17: విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యలో మెళకువలు తెలుసుకొని ప్రాజెక్ట్‌ల తయారీలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్ సూచించారు. మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూలో శుక్రవారం కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి ఇంజినీరింగ్ విద్య కీలకమన్నారు. అంతకు ముందు కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. యూనివర్సిటీలో గోల్డ్‌మెడల్ సాధించిన నలుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. బెస్ట్ స్టూడెంట్ అవార్డు సాధించిన తేజస్వినికి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, మే17: జిల్లా కేంద్రంలో సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసంలో 2024-25 విద్యా సంవత్సరంలో రెండు నుంచి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆవాసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడిగె పురుషోత్తం, నందెల్లి మదన్ మోహన్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో తల్లిదండ్రులు లేని, ఒకరు మాత్రమే ఉన్న పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా వాల్మీకి ఆవాసంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ల 94944 31893, 99892 48893లో సంప్రదించాలని కోరారు.

జగిత్యాల రూరల్, మే 17: జిల్లాలోని బెస్ట్ అవైలేబుల్ పాఠశాలల్లో (రెసిడెన్షియల్ అండ్ నాన్ రెసిడెన్షియల్) 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతిలో 75, ఐదో తరగతిలో 76 సీట్లు ఉన్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ. 1.50 లక్షల్లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షల్లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తుతో పాటు కులం, ఆదాయం, నివాసం, రేషన్‌కార్డు, జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను జత చేసి అందజేయాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 63028 82400లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, మే 17: జగిత్యాల టౌన్-3 సెక్షన్ పరిధిలోని భవానీనగర్, ఎమ్మెల్యే క్వార్టర్స్, కలెక్టరేట్ రెసిడెన్సీ, కరీంనగర్ రోడ్, రామాలయం ఏరియా, ధరూర్ క్యాంపు, చర్చి ఏరియా, అయ్యప్పకాలనీ, బుడిగ జంగాల కాలనీ, హైటెక్ కాలనీ, శాంతినగర్, అంతర్గాం రోడ్, గణేశ్‌నగర్, వినాయకనగర్ ప్రాంతాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రహీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరూర్, వంజరిపల్లి గ్రామాలకు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. హస్నాబాద్, లింగంపేట, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కోరుట్ల, మే 17: పట్టణంలోని శ్రీనివాస్ రోడ్డు, పటేల్ రోడ్డు, మార్కెట్ ఏరియా, గడి బురుజు, పెద్ద మసీదు, తాళ్లచెరువు దిగువ భాగం, గంగంపేట, చారి కట్టె మిషన్ దగ్గర, వినోబా రోడ్డు, కటికవాడ, శివాజీ రోడ్డు, సంతోషిమాత వీధి, ఇందిరారోడ్డు, భీముని దుబ్బ, కల్లూరు రోడ్డు, ఝాన్సీ రోడ్డు, పాత మున్సిపల్, ఆనంద్ నగర్, నక్కలగుట్ట, రైల్వే గేట్, ప్రకాశం రోడ్డు ప్రాంతాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏఈ శ్యాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థికి అడ్మిషన్ పత్రం ఇస్తున్న ఎంఈవో ఆనందరావు, ఉపాధ్యాయులు

## బడిబాట ర్యాలీ

కథలాపూర్, మే 17: మండలంలోని ఇప్పపెల్లి, కథలాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల ఇండ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, బోధనాతీరును తల్లిదండ్రులకు వివరించారు. పలువురు విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, ఉపాధ్యాయులు వెంకటేశం, శశిధర్, కృష్ణారావు, దరందీప్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Peddolla Raju, S/o. Rajaiah, H.No. 7-20/1, Nizamabad V/o Konaraopet Mandal, Rajanna Sircilla Dist. my surname was changed as Thallapelly Raju S/o Rajaiah.
NTK-000

CHANGE OF NAME

★I, MEENA RAVI S/o. KISHTAIAH, M.A.B.Ed., School Assistant, shall henceforth be known as SRI MEESA RAVI S/o. KISHTAIAH, for the purpose of correction wrong entries occurred in school records due to parental mistake.
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

### తడిసిన ధాన్యం పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న సహకార సంఘం అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి

జగిత్యాల రూరల్, మే 17: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని శుక్రవారం సహకార సంఘం అధ్యక్షుడు మైపాల్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు రాజిరెడ్డి, భాస్కర్ రావు, మోహన్‌రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి, నిర్వాహకులు అజయ్, నారాయణ, మల్లేశ్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సందర్శన

కల్లెడలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాల రూరల్, మే 17: కల్లెడ, మోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు చేసిన ధాన్యం తరలించాలి

తుంగూర్ కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

సారంగాపూర్, మే 17: బీర్‌పూర్ మండలం తుంగూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసి బస్తాలను తరలించకపోవడంతో వర్షానికి తడుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.

### రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి రూరల్, మే 17: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల అనుబంధ గ్రామం రామచంద్రంపేటలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని స్థానికులు శుక్రవారం తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెల్లుల్లకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నామని విన్నవించారు. గ్రామస్తులు రాజశేఖర్, రంజిత్, అనిల్, గణేశ్, అనిల్ పాల్గొన్నారు.

### పేద యువతి వివాహానికి చేయూత

మేడిపల్లి, మే 17: మండలంలోని కల్వకోట గ్రామానికి చెందిన బాబా-తబ్బు దంపతుల కూతురు సానియా వివాహం ఈనెల 24న నిశ్చయించారు. కాగా, శుక్రవారం జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు రూ. 5 వేల నగదు అందజేశారు. అలాగే, మాజీ సర్పంచ్ ఆదె లక్ష్మీరాజం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎండీ గాజీపాషా రూ. వెయ్యి చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కట్కం భూమేశ్వర్, బన్నా రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనర్సింహస్వామి నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 17: ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో స్వామి వారి నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ, ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సఖీ కేంద్రాల్లో సేవలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న జిల్లా వెల్ఫేర్ అధికారి వాణిశ్రీ

జగిత్యాల రూరల్, మే 17: మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం వీవోలకు ఉమెన్ ఎంపవర్‌మెంట్ హబ్, సఖీ కేంద్రాల్లో సేవలపై జిల్లా వెల్ఫేర్ అధికారి వాణిశ్రీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ సాధికారత కో-ఆర్డినేటర్ అశ్విని, గౌతమి, హేమశ్రీ, ఆయా గ్రామాల వీవోలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సారంగాపూర్, మే 17: మండలంలోని ఒడ్డెరకాలనీ గ్రామానికి చెందిన గద్దల బక్కవ్వ(60) ఈనెల 15న ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ నుంచి మంటలు వచ్చి చీరకు అంటుకోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. బక్కవ్వ బంధువు పల్లపు బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు.

### న్యాయ విజ్ఞాన సదస్సు

మాట్లాడుతున్న న్యాయమూర్తి పావని

కోరుట్ల, మే 17: పట్టణంలోని కోర్టు ఆవరణలో శుక్రవారం మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కోరుట్ల కోర్టు న్యాయమూర్తి పావని మాట్లాడుతూ, కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, కోశాధికారి రాజశేఖర్, న్యాయవాదులు చాప కిశోర్, సదాశివరాజు, సురేశ్, రఘు, అనాసొద్దీన్, నరేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

### గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

కథలాపూర్, మే 17: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు సంక రాజేందర్ (55) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాజేందర్ భార్య మాధురి రెండు పర్యాయాలు సిరికొండ సర్పంచ్‌గా సేవలందించారు.

### అల్పాహారం పంపిణీ

కోరుట్ల, మే 17: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ఆవరణలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు మహేశ్, వనపర్తి చంద్రమోహన్, మహేశ్, ఉషాకిరణ్, విద్యాసాగర్ తదితరులున్నారు.

### మూడిళ్లలో చోరీ

ధర్మపురి/ధర్మపురి రూరల్, మే 17: ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన కనికరపు మహేశ్, నరేశ్ ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. మహేశ్ ఇంట్లో బీరువాలో దాచిన రూ. 2.35 లక్షల నగదు, నరేశ్ ఇంట్లో భద్రపరిచిన తులంన్నర బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అలాగే, గ్రామానికి చెందిన కాసారపు రాజగౌడ్ ఇంట్లో చొరబడి, బీరువాలో భద్రపరిచిన రూ. 5 వేల నగదుతో పాటు 25 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మూడు కుటుంబాలు శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి ఇంట్లో బీరువా తెరిచి ఉండడం, బట్టలు చిందరవందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్ఐ ఉదయ్‌కుమార్ వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీమ్ వెళ్లి ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### పంటరుణ మాఫీ చేస్తాం

జగిత్యాల, మే 17, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఆగస్టు వరకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టీ జీవన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం కొంటామని తెలిపారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

### రైతులను ఆదుకోవాలి

గోధూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ భీమేశ్వరీ

ఇబ్రహీంపట్నం, మే 17: అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరీ డిమాండ్ చేశారు. గోధూర్, ఇబ్రహీంపట్నంలో తడిసిన ధాన్యాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే, తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వెంటనే తూకం వెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

మేడిపల్లి: సృజన్‌రావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మేడిపల్లి, మే 17: మండల కేంద్రానికి చెందిన ఎన్నమనేని సృజన్ రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబసభ్యులను శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, మల్యాల జడ్పీటీసీ కొండపలకల రామ్మోహన్‌రావు, వెలమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

వెల్గటూర్, మే 17: మండలంలోని ముత్తునూర్ గ్రామంలో గురువారం ధాన్యం తూకం వేస్తుండగా గుండెపోటుతో మృతి చెందిన మొకెనపల్లి రాజయ్య కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. తక్షణ సాయంగా రూ. 20 వేలు అందజేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుమాల తిరుపతి, కుశనపల్లి రాజేశ్, రవి, విష్ణు, లచ్చయ్య, తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ కూలీల నిరసన

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

కోరుట్ల రూరల్, మే 17: మండలంలోని అయిలాపూర్ గ్రామ ఉపాధి హామీ కూలీలు పని కల్పించాలని తహసీల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. గ్రామ శివారులోని నర్సింహుల కుంట, బూరుగు కుంటలో కూలీలు పూడికతీత పనులు చేపడుతున్నారు. పక్కనే ఉన్న రైతులు తమ పట్టా భూమి ఉందని, పనులు చేపట్టవద్దని అడ్డుకున్నారు. దీంతో ఉపాధి హామీ కూలీలు తహసీల్ కార్యాలయానికి వచ్చి విషయాన్ని తెలుపగా స్పందించకపోవడంతో బైఠాయించారు. తహసీల్దార్ ఇట్యాల కిషన్ స్పందించి భూమిని సర్వే చేయించి, పనులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు.

### ప్రతిభావంతులకు సత్కారం

ఇబ్రహీంపట్నం, మే 17: పదో తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన గోధూర్ గ్రామానికి చెందిన కూన శ్రుతి, ఇబ్రహీంపట్నం ఆదర్శ పాఠశాల విద్యార్థులు గొండ హరిణి, ఒద్దె నివేదను శుక్రవారం ఎంపీపీ భీమేశ్వరీ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోటగిరి వెంకటస్వామి, మాజీ సర్పంచులు మురళి, లింగారెడ్డి, ప్రభా